# సామెతలు

గత సంచికలోని సామెతలు చాలావరకు మీరు వినే వుంటారు. కాని మళ్ళీ మళ్ళీ విన్నా వాటిని వినాలనే అనిపిస్తాయి. అదే వాటి గొప్పతనము. మనకు తరతరాలుగా వస్తున్న ధనము. మరి ఉపక్రమించండి.

ఏ చెట్టూ లేని చోట ఆముదపు చెట్టే మహావృక్షము.
చాదస్తపు మొగుడు చెబితే వినడు, తిడితే ఏడుస్తాడు.
అదను ఎరిగి సేద్యం, పదును ఎరిగి పైరు.
అడవిని గాచిన వెన్నెల ... ముదిమిని చేసిన పెండ్లి.
అదృష్టవంతుణ్ణి చెరిపేవారు లేరు, భ్రష్టుణ్ణి బాగుపరిచేవారూ లేరు.
ఉంటే ఉగాది, లేకుంటే శివరాత్రి.
చంకలో గొడుగు పెట్టుకొని, సంతంతా వెదకినట్లు.
తలలు బోడులైన, తలపులు బోడులా?
పగటి మాటలు పనికి చేటు, రాత్రి మాటలు నిద్రకు చేటు.
మన బంగారం మంచిదైతే, కంసాలి మాత్రం ఏమి చేస్తాడు?
శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయములు.
అమ్మ తాను పెట్టా పెట్టదు, అడుక్కుని తినానివ్వదు.
ఉంటే అమీరు సాహెబు, లేకుంటే ఫకీరు సాహెబు, చస్తే పీరు సాహెబు.
చదువురాని మొద్దు ... కదలలేని ఎద్దు.
పదిమందీ నడిచింది బాట, పది మందీ పలికింది మాట.
మాటలు నేర్చిన కుక్కను వేటకు తీసుకుపోతే, ఇసుకో అంటే, ఇసుకో అన్నదట.
స్వామికార్యం, స్వకార్యం కలిసి వచ్చేటట్లు.
అదృష్టం చెప్పిరాదు, దురదృష్టం చెప్పిపోదు.
అరనిమిషము తీరికాలేదు, అరకాసు సంపాదనా లేదు.
కడుపుతోవున్నమ్మ కనకా మానదు, వండినమ్మ తినక మానదు.
చిత్తం శివుడి మీద, భక్తి చెప్పుల మీద.
దున్న ఈనిందంటే, దూడను గాట కట్టివేయమన్నట్లు.
పురిటిలోనే సంధి కొట్టినట్లు.
యోగికి, రోగికి, భోగికి నిద్రలేదు.
అనగా అనగా రాగం, తినగా తినగా రోగం.
అసలే కోతి, దానికి తోడు కల్లు తాగింది, ఆ పైన తేలు కుట్టింది.
కొత్త ఒక వింత, పాత ఒక రోత.
జీలకర్రలో  కర్రలేదు, నేతిబీరలో నేయి లేదు.
నడమంత్రపు సిరికి నెత్తి మీద కండ్లు.
పేనుకు పెత్తనమిస్తే తలంతా తెగ కొరికి పెట్టిందట.
లోగుట్టు పెరుమాళ్ళ కెరుక.
అన్నం పెడితే అరిగి పోతుంది, చీర ఇస్తే చిరిగిపోతుంది, కర్రకాల్చి వాత పెడితే కలకాలం వుంటుంది.

శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్లు ఈ సామెతలు నోట నానితేనే వాటికి విలువ. సానపడితేనే వజ్రం ప్రకాశించేది. వచ్చే సంచికలో మరికొన్ని సామెతలను చూద్దాం. సెలవా మరి!